

పెద్దదర్గాలో ప్రముఖ బాలీవుడ్ సింగర్ ప్రార్థనలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని పెద్ద దర్గాను ప్రముఖ బాలీవుడ్ సింగర్ సల్మాన్ అలీ ఆదివారం పెద్ద దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా పెద్దలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. సల్మాన్ అలీ ఇండియన్ ఐడిల్ పదవ సీజన్‌లో విన్నగా ఉన్నారు. సల్మాన్‌ఖాన్ నటించిన దబాంగ్-3 చిత్రానికి పాటలు పాడారు. పెద్ద దర్గా ప్రతినిధులు దర్గా విశేషాలను వివరించారు.



ప్రార్థలు చేస్తున్న బాలీవుడ్ సింగర్ సల్మాన్ అలీ

చర్చించేనా?



- కడప నగర రహదారుల పురోగతి ఏదీ?
- సా..గుతున్న ఉక్కు పరిశ్రమ ఏర్పాటు
- అన్నమయ్య నిర్వాసితులకు స్వాంతనేదీ
- 'కొప్పర్తి' పైప్‌లైన్ ఏర్పాటు ఎప్పుడో?!
- నేడు జడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కడపప్రతినిధి

జిల్లా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చర్చించడంపై అందరి దృష్టి నిలిపింది. ప్రతిపక్ష టిడిపి నుంచి పాలకపక్షం తప్పిదాలను నిలదీసే అవకాశాలు తగ్గిన నేపథ్యంలో సమగ్ర చర్చ దేవతావస్త్రంలా మారిన సంగతి తెలిసిందే. కడప నగరంలోని ఆరు రహదారుల విస్తరణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. వర్షాకాలం రాబోతున్న తరుణంలో రహదారుల విస్తరణ పనుల్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది. కడప నగరంలోని ముంపు ప్రాంతాల సంరక్షణకు ఉద్దేశిం చిన మెయిన్ డ్రెయిన్ పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. జిల్లా ప్రధానంగా వ్యవసాయాధారిత ప్రాంతం. ఖరీఫ్ ప్రణాళిక రూపకల్పనలో సూచనలు, సలహాలు చేయడం, ఎరువులు, పురుగు మందుల కొరత తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా చర్చించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలోని అన్నమయ్య, గండి కోట నిర్వాసితుల మొర, పింఛా, ఎల్ఎస్‌పి గేట్ల మరమ్మతులు, సర్వరాయసాగర్, బ్రహ్మంసాగర్, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలోని లింగాల కాల్వ లీకేజీ, యురేనియం పైప్‌లైన్ పనుల పురోగతిపై ప్రధానంగా చర్చించాల్సి ఉంది. 2021 నవంబర్ వరదల్లో అన్నమయ్య రిజర్వాయర్ మట్టి కట్ట తెగిన సందర్భంగా సుమారు ఆరు గ్రామాల ప్రజానీకం నిర్వాసితులుగా మారిన సంగతి తెలిసిందే. అప్పట్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్వాసితులను ఆదు కుంటామని హామీనిచ్చారు. ఇప్పటికీ హామీలో ఆశించిన పురోగతి కనిపించ లేదు. ఇదిలాఉండగా పింఛా, ఎల్ఎస్‌పి గేట్లకు మరమ్మ తులు, సర్వరాయసాగర్, బ్రహ్మంసాగర్ లీకేజీల పరిష్కారం, యర్ర బల్లి - పార్నపల్లి పైప్‌లైన్ పనుల్లో ఆలస్యం కారణంగా యురేనియం నిర్వాసిత గ్రామాలకు తాగునీటి సమస్య ఎప్పటికి పరిష్కారమవు తుందో సమాధానం రాబట్టాల్సి ఉంది. ప్రతియేటా వర్షాకాలంలో వచ్చే వరదల నుంచి కడప ముంపు ప్రాంతాల పరిరక్షణపై దృష్టి సారించాల్సి ఉంది. గండికోట నిర్వాసితులకు రూ.ఏడు లక్షల పరి హారానికి అదనంగా మరో రూ. మూడు లక్షలను అందిస్తామని ఇచ్చిన హామీని నిలుపుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. కడప జిల్లా జీవనాడిగా పేర్కొంటున్న ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేయడం సరే, పనుల పురోగతి కనిపించడం లేదు. 2019 సార్వత్రిక ఎన్నికల ముంగిట తాము అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలులో మూడు అడుగు ముందుకు ఆరు అడుగులు వెనక్కి చందంగా మారింది. ఈఏడాది ప్రారంభంలో జెఎస్‌డబ్ల్యూ సంస్థ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఇప్పటివరకు ఆశించిన పురోగతి కనిపించక పోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. కొప్పర్తిలో పరిశ్రమల ఏర్పాటుకు అవ సరమైన నీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు ప్రక్రియ ఎప్పటికి పూర్తవు తుందో తెలియడం లేదు. రాష్ట్రప్రభుత్వ నిష్క్రియాపరత్వం కారణంగా కొప్పర్తికి పరిశ్రమల రాక ఆలస్యమవుతోంది. ఫలితంగా జిల్లాలో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు వలసలు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా జిల్లా పరిషత్ పాలకవర్గం జిల్లా సమగ్రాభివృద్ధి అర్థవంతమైన చర్చ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పడంలో సందేహం లేదు.

విద్యా కానుక పంపిణీకి కసరత్తు

1,58,156 మందికి అందజేత
చురుకుగా నాడు-నేడు పనులు
సమగ్రశిక్ష అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎ.ప్రభాకర్‌రెడ్డి

జిల్లాలో జగనన్న విద్యాకానుక పంపిణీ చేయడానికి కసరత్తు ఊపందుకుంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాథమిక విద్యార్థి దశ నుంచి ఉన్నతవిద్య వరకు నాడు-నేడు, ఫీజు రియింబర్స్‌మెంట్ వంటి పథకాల అమలుతో విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తున్నామని పేర్కొంటున్న సమగ్రశిక్ష అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎ.ప్రభాకర్‌రెడ్డితో ప్రజాశక్తి ముఖాముఖి..

- ప్రజాశక్తి - కడపప్రతినిధి



ముఖా ముఖి..

విద్యాకానుక అర్హుల గురించి తెలపండి?

జూన్ రెండవ వారంలో పాఠశాలలు తెరిచే అవకాశాలు ఉన్నాయి. రూ.32 కోట్ల వ్యయంతో జగనన్న విద్యాకానుక పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలో జూన్ రెండవ వారం నుంచే ఒకటి నుంచి పదవ తరగతి చదివే 1,58,156 మందికి అందజేస్తాం. దీంతోపాటు తెలుగు- ఇంగ్లీష్ ఆక్స్‌ఫర్డ్ డైరీని పంపిణీ చేస్తాం.

కిట్‌లోని సామగ్రి వివరాలేమిటి?

మూడు జతల యూనిఫామ్స్, రెండు జతల సాక్సులు, షూ, స్కూల్‌బ్యాగ్, బెల్టు, టెక్స్‌బుక్స్, నోట్‌బుక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, అందజేస్తాం. ఇందులో తెలుగు-ఇంగ్లీష్ మీడియం పుస్తకాల్లో మిర్రర్ ఇమేజ్‌తో కూడిన క్వాలిటీ ఉంటోంది. ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు టెక్స్‌బుక్స్ తో పాటు ఎనిమిది నోట్‌బుక్స్, ఎనిమిదవ తరగతికి 10 నోట్‌బుక్స్, తొమ్మి దవ తర గతికి 12 నోట్‌బుక్స్, 10వ తరగతి విద్యార్థులకు 14 నోట్‌బుక్స్ పంపిణీ చేస్తాం.

విద్యాకానుక అమలు ద్వారా ఆశించే లక్ష్యాలేమిటి?

జిల్లాలోని 2,250 ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ లేకుండా చూడడం, నాణ్యమైన విద్యాబోధనకు సంబంధించిన సదుపాయాలను కల్పించడం ద్వారా అక్షరాస్యత శాతాన్ని పెంచడం, ఫలితంగా బడుగు, బలహీన, సంపన్న తరగతులనే బేధాలను తగ్గించి సమానత్వాన్ని సాధిం చడం లక్ష్యాలుగా ఉన్నాయి.

డ్రాపౌట్స్ నివారణ కృషిని వివరించండి?

మండలానికి సిఆర్‌పిలు, సచివాలయ సిబ్బంది క్యాంపెయిన్ ఏర్పాటు చేయడమైంది. బడిబయటి పిల్లలను బడిలో చేర్పించేలా చర్యలు తీసుకుంటాం. వీరితో పాటు అనాథ, వలస కార్మికుల పిల్లలను గుర్తించ డమైంది. వీరిని బడికి రప్పించే ప్రయ త్నాల్లో భాగంగా మన బడికి పోదాం అనే యాప్‌ను తయారు చేసి పేర్లు నమోదు చేస్తున్నాం. జిల్లాలో గతేడాది 3,600 మందికి ఉండగా, 197 మంది డ్రాపౌట్స్ ఉన్నారు. డ్రా పౌట్స్ పిల్లల పునరుద్ధరణలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉన్నాం.

ప్రభుత్వ పాఠశాలల అడ్మిషన్లలో పెరుగుదల ఏమైనా ఉందా?

గత మూడేళ్లతో ప్రవేశాలతో పోల్చితే అడ్మిషన్ల పెరుగుదల స్వల్ప ంగా కనిపిస్తోంది. ప్రతి యేటా ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్టను పెంపొం దించడానికి ప్రాధాన్యతకు ప్రాముఖ్యత లభించింది. ఫలితంగా భవిష్యత్‌లో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల నుంచి వలసలు పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పవచ్చు.

నాడూ-నేడూ పురోగతి వివరించండి?

నాడూ-నేడూ 1006 పాఠశాలలను ఆధునీకరించడమైంది. రెండవ విడత కింద రూ. 290 కోట్లతో 11 రకాల పనుల్ని చేపట్టడమైంది. జూన్ 11 నాటికి కాంపౌండ్‌వాల్స్, అదనపు తరగతి గదులు మినహా మిగిలిన తొమ్మిది కాంపొనెంట్స్ అందుబాటులోకి తీసుకు రావడంపై దృష్టి సారించాం. ఆగష్టు 15 నుంచి రెండవ విడత నాడూ-నేడూ పథకం కిం ద 1,094 పాఠశాలలను ఆధునీకరణ పనులు చేపట్టడం జరుగుతుంది.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

విఆర్ఎలకు ఇచ్చిన హామీని, వారి సమ స్యలను వెంటనే పరిష్కరించాలని విఆర్ఎ రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 సంవత్సరంలో విఆర్ఎల ధర్నా ప్రాంతానికి వచ్చిన అప్పటి ప్రతిపక్ష నాయకులు జగన్ మోహన్‌రెడ్డి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.15000 వేతనం ఇస్తానని అలంకార సాక్షిగా మాట ఇచ్చారని పేర్కొన్నారు. అధి కారంలోకి వచ్చిన తర్వాత విఆర్ఎలకు జీతాలు పెంచకపోవడం అన్యా యమని తెలిపారు. విఆర్ఎల పని గ్రామాలలో, పట్టణాలలో చాలా కీలకమని చెప్పా రు. తాతల, ముత్తాతల కాలం నుంచి గ్రామ సేవకులు కష్టపడి పని చేస్తు న్నారని పేర్కొన్నారు. అలాంటి వారికి జీతం పెంచకపోవడం బాధాకరమని తెలిపారు. అర్హులైన వారందరికీ వాచ్‌మెన్, అటెండర్, డ్రైవరు అన్ని రకాల ఉద్యోగోన్నతలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో విఆర్ఎ రాష్ట్ర నాయకులు కర్నూలు అంజి, సిఐటియు జిల్లా ప్రధాన కార్య దర్శి బి మనోహర్, విఆర్ఎ సంఘం నాయకులు నాగేంద్ర, రమణ, లక్ష్మీనా రాయణ, శివా, రాజు, నరసింహులు, బాలకృష్ణ, ప్రకృద్దిన్, బాషా, వెంకట రమణ పాల్గొన్నారు. విఆర్ఎ జిల్లా కన్వీనర్‌గా నాగేంద్రను ఎన్నుకున్నారు.

ఘనంగా చాంద్ ఫిరా గుంబద్ దర్గా నషాన్ ఉత్సవాలు

కడప అర్బన్ : రహమతుల్లా వీధిలో వెలసివున్న చారిత్రాత్మకమైన చాంద్ ఫిరా గుంబద్ దర్గా నషాన్ ఉత్సవాల కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ముతవల్లి అమీరున్నిసా ఇంటి నుంచి గంధాన్ని ఫకీర్ల మెళ తాళాలతో దర్గా వద్దకు తీసుకువచ్చి, ఫతేహ చేసి గంధాన్ని సమర్పించారు. దర్గా ఆవరణంలో ఉన్న జెండా దగ్గర నషాన్ ఉత్సవాలు నిర్వహించి, జెండాను అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ పెద్దలు, పలువురు ప్రముఖులు, స్థానిక ప్రజలు, భక్తాదులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - కడప అర్బన్



అన్నదానం చేస్తున్న అమీర్ బాబు

అన్నదా నం గొప్పదని టిడిపి కడప నిరి యోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీ ర్‌బాబు పేర్కొన్నారు. టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య తల్లి కొండా సుబ్బమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ వద్ద ఉన్న ప్రేమాలయ నిరాశల వసతి గృహంలో అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అమీర్ బాబు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా సుబ్బయ్య తల్లి ప్రథమ వర్ధంతి సందర్భంగా నిరాశలకు ఇలాంటి అన్నదానా కార్యక్రమాలు ఏర్పాటు చేయడము అభినందనీయం అన్నారు. జన్మనిచ్చిన తల్లిని ఎవరూ మరవకూడదని వారి జయంతి, వర్ధంతిని గుర్తు చేసుకుంటూ తమకు తోచిన విధంగా కార్యక్రమలు నిర్వహిస్తూ ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కత్తి రవీంద్ర, కడప సిటీ యువజన అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్ రాయల కరిముల్లా డివిజన్ ఇన్‌చార్జి కొండ్రెడ్డి జనార్దన్ రెడ్డి బిసి సెల్ ఉపాధ్యక్షులు నాదెళ్ల దస్తగిరి సిటీ బిసి సెల్ కార్యదర్శిలు కత్తి వెంకటరమణ రాజశేఖర్ రియాజ్ పాల్గొన్నారు.

'సీమ' అస్తిత్వాన్ని తెలిపేదే 'సాధన'

కడప అర్బన్ : అస్తిత్వ సాధన కోసం జరిగిన, జరుగుతున్న సీమ ప్రస్థానం గురించి తెల్పేందుకే 'సాధన' నవల రాశానని ప్రముఖ కథా నవలా రచయిత డాక్టర్ శాంతి నారాయణ అన్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు ఆధ్వర్యంలో ఆదివారం సి.పి. బ్రౌన్ భాష పరిశోధన కేంద్రంలో ఆయన రచించిన 'సాధన' నవల పరిచయ సభలో నవలా రచనకు స్ఫూర్తినిచ్చిన అంశాల గురించి మాట్లాడారు. 80 ఏళ్లుగా సీమకు అన్యాయం జరుగుతోందని, ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలు, భాష, ఆహారం, జీవన విధానాన్ని కోస్తావారు ఎద్దేవా చేస్తూనే ఉన్నారనీ, సినిమాల్లో మనలను హింసావాదులుగా చూపుతూనే ఉండడం అన్యాయమన్నారు. ఈ ప్రాంతం వారు గనుక డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి, నిబద్ధతగల వ్యక్తి గనుక ఎన్టీ రామారావు మాత్రమే సీమకు న్యాయం చేసేందుకు చిత్తశుద్ధితో కృషిచేశారన్నారు.

నోట్ల రద్దు ప్రభుత్వ వైఫల్యం : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం 2016లో పెద్ద నోట్ల రద్దుపై సిపిఎం చేసిన విమర్శ సరైందేనని రుజువైందని ఆ పార్టీ నగర కార్యదర్శి రామమోహన్ పేర్కొన్నారు. ఆదివారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలామణిలో నుంచి రూ.2000 నోట్లను ఆర్‌బిఐ ఉపసంహరించుకుందని తెలిపారు. దేశం ఎదుర్కొంటున్న నల్లధనం, అవినీతి, తీవ్రవాద కార్యకలాపాలకు నిధులు అందచేయడం వంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు మోడీ ఆర్భాటంగా 2016లో ప్రకటించిన పెద్ద నోట్ల రద్దును వాస్తవంగా తిప్పికొట్టిందని సిపిఎం ధృఢంగా విశ్వసిస్తున్నట్లు పేర్కొందన్నారు. అన్ని రంగాల్లో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. గత అనుభవాల రీత్యా చూసినట్లయితే రూ.2వేల నోట్లలో పేరుకుపోయిన నల్ల ధనం నిల్వలను ప్రక్షాళన చేయడం కన్నా ఈ చర్య వాటిని మరింత చట్టబద్ధం చేస్తుందని అభిప్రాయపడ్డారు. మోడీ చేపట్టిన పెద్ద నోట్ల రద్దు చర్యతో కోట్లాదిమంది ప్రజల జీవనోపాధులు దారుణంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. వందలాదిమంది జీవితాలను బలి తీసుకుందన్నారు. పెద్దనోట్ల రద్దు తర్వాత ఎంత నల్లధనం బయటికి తీశారు అనే విషయం పై లెక్కలు చెప్పలేని స్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు. ప్రధానంగా ఎక్కువ మందికి ఉపాధి కల్పించే చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దివాలా తీశాయని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ప్రజానీకం కృషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో సిపిఎం నాయకులు, కార్యకర్తలు, సభ్యులను చైతన్యవంతం చేయడానికి ఈనెల 29, 30 తేదీల్లో కడప నగరంలో 2 రోజుల పాటు రాజకీయ శిక్షణా తరగతులు నిర్వస్తున్నామన్నారు. సమావేశంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ఫారుక్ హుస్సేన్, ఎం.ఆర్. నాయక్ పాల్గొన్నారు.

అసైన్‌మెంట్ కమిటీ నిర్వహించాలి

కాశినాయన : మండలంలోని పేదలంతా అసైన్‌మెంట్ కమిటీ కోసం ఎదురు చూస్తున్నారని, వెంటనే నిర్వహించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పోలయ్య పేర్కొన్నారు. ఆదివారం అయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ చేపడుతామని ఏడాది నుంచి పేదలకు ఆశలు చూపుతూ నిరుత్సాహ పరుస్తామని తెలిపారు. మండలంలో పేదలు చాలామంది ఐదు, పదేళ్ల నుంచి ప్రభుత్వ బంజర భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పట్టాలు ఇవ్వమని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి ధర్నాలు చేశామని చెప్పారు. అప్పటి నుంచి అధికారులు పట్టాలు ఇస్తామని చెబుతూ కాలయాపన చేస్తున్నారని తెలిపారు. సావిశెట్టి పల్లెలో దాదాపు 50 ఎకరాలు ఇటుకలపాడు, 50 ఎకరాలు వరికుంట్ల, 30 ఎకరాలు ఆకుల నారాయణపల్లె, 70 ఎకరాలు గంగనపల్లి, 20 ఎకరాలు నాయన పల్లె 20 ఎకరాలు, ఈ విధంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పేద ప్రజలు భూములు సాగు చేసుకుంటున్నారని, ప్రభుత్వం పట్టాలు ఇవ్వకపోవడం వల్ల బడా నాయకులు కొందరు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని వాపోయారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పలుమార్లు ధర్నాలు చేశామని అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడైనా ప్రభుత్వం అసైన్మెంట్ కమిటీ నిర్వహించి పేదలకు పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

పోరుమామిళ్ల టౌన్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని చదవాలని, విద్యార్థులు చదువుతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ హుస్సేన్ అన్నారు. పోరుమామిళ్లలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల ఆకాంక్షలు నెర వేర్చడం విద్యార్థుల బాధ్యత అన్నారు. విద్యార్థులకు సోమ,మంగళవారాలలో పాటలు, కథలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ అధికారి ఆఫ్రిది అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు దాదాపీర్, పాఠకులు యశ్విత, అయిమెన్, జస్విత, మోక్షిత, ఖాజావలి, రంగనాయకులు పాల్గొన్నారు.

అరుదైన గ్రూపు రక్తదానం

పోరుమామిళ్ల టౌన్ : పట్టణానికి చెందిన రమణమ్మ అనే మహిళ అనారోగ్యంతో ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేరారు. ఆమెకు బి నెగిటివ్ గ్రూపు రక్తం అవసరమని వైద్యులు సూచించగా కుటుంబ సభ్యులు రైట్‌హ్యాండ్ ఛారిటబుల్ ట్రస్ట్‌ను ఆశ్రయించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు సుమంత్ చే బి నెగిటివ్ రక్తం అత్యవసరంగా రక్త దానం చేయించారు. సంస్థ ఫౌండర్స్ రసూల్ ప్రసాద్ అడిగిన వెంటనే రక్త దానం చేసినకు కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసరంగా రక్తం కావాలనుకుంటే 8125991900 వాట్స్ అప్ నంబర్ కి మెసేజ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు గోపి లాబ్ సిబ్బంది రమణ పాల్గొన్నారు.


పాలిసెట్‌లో 145వ ర్యాంకు

కలసపాడు : పాలిసెట్ ఫలితాల్లో స్థానిక సెయింట్ ఆంటోనీస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థి పి. స్పందన రాష్ట్ర స్థాయిలో 145వ ర్యాంకును సాధించింది. పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థిని పాలిసెట్‌లో ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించడంతో పాఠశాల యాజమాన్యం చిత్తా రాజశేఖర్‌రెడ్డి, చిత్తా ప్రభావతి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

అకాల వర్షానికి 'అరటి' ధ్వంసం

- వెయ్యి ఎకరాల్లో పంట నష్టం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



గాలివానకు నేలకొరిగిన అరటి పంట

పులివెందుల డివిజన్ పరిధిలో ఆదివారం కురిసిన గాలివాన బీభత్సానికి దాదాపు వెయ్యి ఎకరాలకుపైగా అరటిపంటకు నష్టం వాటిల్లింది. మొత్తం డివిజన్ పరిధిలో అరటిపంట దాదాపు 18,000 ఎకరాలలో రైతులు సాగు చేశారు. ఆదివారం సాయంత్రం పెనుగాలులుతో కూడిన వర్షంతో పడడంతో దాదాపు 1000 ఎకరాలకు పైగా అరటిపంట ధ్వంసమైంది. పంట నష్టం రూ. కోటిపైనా ఉంటుందని ఉద్యానవన శాఖాధికారులు పేర్కొంటున్నారు. పంట చేతికొచ్చే సమయంలో గాలివాన రావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాము చేసిన అప్పులన్నీ ఈ పంటతో తీరిపోతాయని ఎంతో ఆశగా చూస్తున్న రైతుల్లో ఉన్నట్లుండి అకాల వర్షం వారి పాలిట శాపంగా మారింది. పంట నేలకు వాలిపోవడంతో, ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. తమల్ని ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

పిడుగు పాటుకు గొర్రెల కాపరి మృతి



కాకర్ల గురయ్య (ఫైల్‌ఫొటో)

కాశినాయన : కలసపాడు మండలంలోని తెల్లపాడు గ్రామానికి చెందిన చెందిన కాకర్ల గురయ్య (39) మృతిచెందాడు. ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. అ సమయంలో గొర్రెలు మేపుకోనేందుకు వెళ్లిన గుర వయ్యపై పిడుగు పడ్డడంతో అక్కడికక్కడే మృతి చెం దాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతు డు రోజు మాది రిగానే గొర్రెలు మేపుకొని ఇంటికి వస్తుం డగా ఉన్నట్లు ఉండి ఉరుములు రావడంతో పిడుగు పడి అక్కడికక్కడే చని పోయాడు. పేద కుటుంబాన్ని ప్రభుత్వమే ఆర్థికంగా ఆదుకోవాలని ప్రజలు కోరారు.

కాడెద్దు మృతి

కొండాపురం : మండలంలోని సిరిగే పల్లెలో అల్లపురెడ్డి వెంకట శివారెడ్డి తన ఎడ్లను కల్లం దొడ్డిలో కట్టి ఉంచారు. ఈ సమయంలో ఒక ఎద్దుపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందిందని వాలంటీర్ నీలకంఠేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎద్దు విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ముగ్గురు గంజాయి విక్రయదారులు అరెస్టు

- 24 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - కడప అర్బన్

రామరాజు పల్లె ఫాతిమా కళాశాల వద్ద ముగ్గురు గంజాయి విక్రయదారులను అరెస్టు చేసి వారి నుంచి 24 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సిఐ వలసయ్య పేర్కొన్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులు శ్రీరామ్ నర్సింహులు, కోటపాటి ప్రేమ్ కుమార్, నరసింహులు, కందుల సాయినాథ్, ఉరఫ్ సాయిని అరెస్టు చేశామని చెప్పారు. వీరి వద్ద నుంచి 24 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎస్‌పి అన్బు రాజన్ ఆదేశాల మేరకు జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చాలనే ఉద్దేశంతో ప్రత్యేక దాడులు నిర్వహించాలని ఆదేశించారని పేర్కొన్నారు. అందులో భాగంగా డిఎస్‌పి షరీఫ్ పర్యవేక్షణ లో దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం వచ్చిన సమాచారం మేరకు తన సిబ్బంది రామరాజుపల్లి, ఫాతిమా మెడికల్ కాలేజ్ దగ్గర రైల్వే ట్రాక్ ప్రక్కన కంపచెట్ల మధ్యలో రహస్యంగా గంజాయి అమ్ముతూ ఉండగా పట్టుకున్నామని చెప్పారు. యువతను గంజాయి మత్తుకు బానిసను చేస్తూ, వారిని చెడుదారి పట్టిస్తూ, గంజాయి స్మగ్లర్లు, గంజాయి అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గంజాయిని పట్టుకోవడంలో కృషి చేసిన తాలూకా ఇన్‌స్పెక్టర్ ఉలసయ్య, ఎస్ఐ రామక్రిష్ణ, ఎఎస్ఐ తాయార్ హుస్సేన్, సిబ్బంది వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు కిరణ్ కుమార్ నాయక్, ప్రసన్న కుమార్, పుల్లయ్య, శ్రీనివాసులును ఎస్‌పి అన్బురాజన్, డిఎస్‌పి షరీఫ్ అభినందించారు.

మరిన్ని సేవలతో మంచిపేరు నిలుపుకుందాం

ప్రజాశక్తి- కడప అర్బన్

ఆపదలో ఉన్నవారికి సేవలందించడంలో మనకున్న మంచి పేరును నిలుపుకునేందుకు కృషిచేద్దామని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్, ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ మానస కె.చిన్నప రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని గ్రాండ్ ఇన్ హోటల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆపన్నులను సమయానికి ఆదుకోవడంలో లయన్స్‌కు మంచిపేరు ఉందని చెప్పారు. మరింత సేవా దృక్పథం ఉన్న వారిని కలుపుకుని ఆదర్శంగా నిలవాలని సూచించారు. క్లబ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆర్. రంగనాథ రెడ్డి మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ఇంతవరకు వినూత్నమైన సేవా కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. ప్రకృతి విలయాలు సంభవించినప్పుడు జిల్లా అధికారుల సూచనల మేరకు అవసరమైన ప్రాంతాలలో వెంటనే సేవలందించగలిగామని వివరించారు. కార్యదర్శి వి. గౌరీ శంకర్ మాట్లాడుతూ ప్రస్తుత సభ్యుల సంఖ్య, చేయదలచుకున్న సేవా కార్యక్రమాల గురించి నివేదిక చదివి విన్పించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సూచనలు, సలహాలు అందజేశారు. నిర్వాహకులు నూతన సభ్యులకు సంస్థ కేంద్ర కార్యాలయం పంపిన సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలను వారికి అందజేశారు. సంస్థ ముద్రగల బ్యాడ్జీలను అందజేసి ప్రతి కార్యక్రమానికి వాటిని ధరించి రావాలని కోరారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు భవిష్యత్ ప్రణాళిక గురించి చర్చ నిర్వహించారు.



యోగా సాధన పూర్తి చేస్తున్న చిన్నారులు

చిన్నపిల్లల యోగా శిబిరం ముగింపు

ప్రజాశక్తి - కడప అర్బన్

పటేల్ రోడ్ లోని మిత్ర యోగా సెంటర్ లో 21 రోజులపాటు నిర్వహించిన చిన్నపిల్లల యోగా శిబిరం ముగింపు ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి బీతిహరానంద మాట్లాడుతూ చిన్నపిల్లల్లో శారీరక మానసిక దృఢత్వానికి, ఏకాగ్రత పెరగడానికి, నైతిక విలువలు పొందడానికి యోగ సాధన చక్కని మార్గమని, దైనందిన జీవితంలో ఆహార అలవాట్లకు చాలా ప్రాముఖ్యత ఉందని తాజాగా ఇంట్లో వండిన ఆహారానికి ప్రాముఖ్యత ఇవ్వాలని, బర్గర్లు పిజాల సంస్కృతికి దూరంగా ఉండాలని, యోగాసనాల సాధన వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా ఎలాంటి విపరీత పరిస్థితులు నైనా ఎదుర్కొనే సామర్థ్యం పిల్లల్లో ఏర్పడుతుందని అన్నారు. యోగివేమన యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ కె రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రాచీన భారతీయ రుషులు, యోగులు మనకందించిన గొప్ప వరం అన్నారు. చిన్న వయసు నుంచే విద్యార్థులను తల్లిదండ్రులు యోగా సాధన వైపు ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థుల దైనందిన జీవితాలలో యోగ సాధన ఒక భాగమై పోవాలని పేర్కొన్నారు. తద్వారా పిల్లలు శక్తివంతమైన, మంచి పౌరులుగా సమాజంలో ఎదుగుతారన్నారు. తదనంతరం యోగాసనాలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ స్వామీజీ స్వామి సంకర్షణానంద, యోగా నిపుణులు డాక్టర్ కె. కల్పన, డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి,తల్లిదండ్రులు పాల్గొన్నారు..

బధిర విద్యార్థులకు ప్రవేశాలు

కడప అర్బన్ : నగరంలోని హెలెన్‌కెల్లర్ బధిరుల ఉన్నత పాఠశాలలో 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్య, వసతి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు కరస్పాండెంట్ డాక్టర్ పి. దౌలత్‌ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత విద్య, హాస్టల్ వసతితో పాటు స్పీచ్ తెరపి, ఆడిటర్ ట్రెనింగ్, కంప్యూటర్, టైలరింగ్‌లో శిక్షణ ఇస్తామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను సర్టిఫికెట్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో రామాంజనేయ పురం, సబ్ జైలు ఎదురుగా ఉన్న హెలెన్ కెల్లర్ విద్యాసంస్థలో సంప్రదించాలని పేర్కొన్నారు. వివరాలకు 9849311680, 996600 6758లలో సంప్రదించాలని తెలిపారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ సంజీవరెడ్డి

ప్రశాంత జీవనాన్ని గడపాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఫ్యాక్షన్ వీడి ప్రశాంత జీవనాన్ని గడపాలని కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి సూచించారు. మండలంలోని మాలెపాడు గ్రామంలో ఎస్ఐ ఆదివారం నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లు, పొలాలు, గడ్డివాములు తదితర ప్రదేశాల్లో సోదా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్పి అన్బురాజన్ ఆదేశాల మేరకు మాలెపాడులో నాకాబందీ నిర్వహించినట్లు తెలిపారు. ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు సంఘటనలు జరగకుండా ఉండాలని ఎస్ఐ ప్రజలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె


టిడిపిలో చేరిన సింగారెడ్డి జయచంద్రారెడ్డి

టిడిపి బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రారెడ్డి కోరారు. వైసిపికి చెందిన వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సింగారెడ్డి జయచంద్రారెడ్డి ఆదివారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా జయచంద్రరెడ్డి, అయన అనుచరులకు బిటెక్ రవీంద్రారెడ్డి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు స్థానిక సాయిబాబా ఆలయం వద్ద నుండి గాండ్లవీధి వరకు పార్టీ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం బిటెక్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ టిడిపికి పూర్వ వైభవం వస్తుందన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరడం సంతోషంగా ఉందన్నారు. పులివెందుల నియోజకవర్గంలోని అయా మండలాల్లో కూడా టిడిపిలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నట్లు ఆయన తెలిపారు. పులివెందులలో జగన్‌కు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, తెలంగాణ వలి, ఆర్‌వి రమేష్, శ్రీను, డక్కా రమేష్, వీరభద్ర, జబిబుల్లా, మారుతి, మల్లికార్జున, మహమ్మద్ ఇనాయతుల్లా, వేమిరెడ్డి కృష్ణారెడ్డితోపాటు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిని అడ్డు పెట్టుకొని రాజకీయం చేయడం దుర్మార్గం

వివేకానందరెడ్డి హత్య కేసులో తల్లిని అడ్డు పెట్టుకొని ఎంపీ అవినాష్‌రెడ్డి రాజకీయం చేయడం దుర్మార్గమని బిటెక్ రవీంద్రారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలులోని విశ్వభారతి హాస్పిటల్‌లో ఆడే డ్రామాపై వైఎస్ కుటుంబానికి ఇంత ఖర్మ ఎందుకు వచ్చిందో అని పులివెందుల ప్రజలు చర్చించుకొంటున్నట్లు తెలిపారు. కర్నూలు కంటే పెద్ద ఆసుపత్రులు లేనట్లు వారికి అనుకూలంగా ఉన్న ఆసుపత్రిలో ఉంటూ ఠాగూర్ సినిమాలోలా డ్రామా చేస్తున్నట్లు విమర్శించారు. పులివెందులలో వైసిపికి ప్రస్తుత పరిస్థితుల్లో ఉన్న కష్టాలు గతంలో ఎన్నడూలేవని, సిఎం జగన్ ద్వారానే వచ్చాయని ఆయన పేర్కొన్నారు.


కొవ్వొత్తుల ర్యాలీలో ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది

సమాజ చైతన్యానికి నిశ్శబ్ధ ర్యాలీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల సంస్మరణ దినం సందర్భంగా ఆదివారం జమ్మలమడుగు ఏరియా హాస్పిటల్‌లో సమాజాన్ని చైతన్యం చేసేందుకు నిశ్శబ్ద ర్యాలీ నిర్వహించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రఫిక్‌బాషా తెలిపారు. హెచ్‌ఐవి నివారణ భాగంగా ఇలాంటి కార్యక్ర మాలు చేపడు తున్నట్లు తెలిపారు. హెచ్‌ఐవి ఎయిడ్స్ చికిత్స పొందుతూ తమ జీవితాలను తామే కాపాడు కాపాడుకునేలా స్వీయ జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. సమాజంలో వివక్షతకు గురికాకుండా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఐసిటిసి కౌన్సిలర్ వి.ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్ ద్వారా చనిపోయిన వారి జ్ఞాపకార్థంగా మే 21న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నుండి పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుజాత, చంద్రశేఖర్, రామచంద్ర, జ్యోతి, బాలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి - లింగాల

మండల కేంద్రంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం పాడా నిధులతో రూ.22 లక్షల వ్యయంతో పైపులైన్ ఏర్పాటు చేస్తున్నట్లు కడప పార్లమెంటు సెక్రటరి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం ఎగువలింగాలలోని పాత చెరువు వద్ద రెండు బోరుబావులు వేశారు. ఇందులో నీరు పుష్కలంగా పడడంతో అక్కడి నుంచి ఎగువ లింగాల, దిగువ లింగాల గ్రామాలకు తాగు నీటికి ఇబ్బంది లేకుండా శాశ్వత పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం దాదాపు 300 ఇనుప పైపులు ఏర్పాటు చేస్తున్నారు. రెండు గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు. ఇందుకోసం సిఎం వైఎస్ జగన్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి కృషి చేశారన్నారు.


సమస్య పరిష్కారానికి తెచ్చిన పైపులు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మండలంలోని రాజీవ్‌నగర్ కాలనీలో మోరగుడి ఇళ్ల మధ్య రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ రక్షణలేక ప్రమాదకరంగా ఉంది. ఏ మాత్రం ఆదమరిచినా ప్రాణనష్టం వాటిల్లనుందని స్థానికులు హడలిపోతున్నారు. పిల్లలు, పశువులు పొరపాటున అటువైపు వెళితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని హడలిపోతున్నారు. అటుగా వెళ్లేటప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా శబ్ధం వినిపిస్తూ ఉంటోంది. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


రక్షణలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

వంతెన నిర్మాణానికి ఏళ్ల తరబడి నిరీక్షణ

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రానికి సమీపంలోని నక్కలదిన్నె గ్రామానికి వెళ్లే దారిలో గుండ్ల వంకపై ఉన్న వంతెన ఎన్నో ఏళ్లుగా ఆధునికరణకు నోచుకోవడం లేదు. దీంతో వర్షాకాలంలో ఈ మార్గాన రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అధిక వర్షాలు పడిన సమయంలో నీరు తగ్గుముఖం పట్టే వరకు మండల కేంద్రంతో సంబంధాలు లేకుండా పోతున్నాయి. శాస్త్ర, సాంకేతికంగా దేశం ఎంతగానో అభివృద్ధి చెందినప్పటికీ పల్లెలు మాత్రం పాత విధానంలో నడవాల్సి వస్తోంది. వర్షం వస్తే కొన్ని రోజులుగా మండల పరిధిలోని కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు గ్రామాలకే పరిమితం కావాల్సిన పరిస్థితి. ప్రభుత్వాలు మారుతున్నా వాగులు, వంకలపై పురాతన పాత వంతెనలే దర్శనమిస్తున్నాయి. హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణానికి నోచుకోవడంలేదు. వర్షానికి నీట మునిగిన సందర్భంలో ఆర్‌అండ్‌బి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం తర్వాత వాటి గురించి పట్టించుకోకపోవడం జరుగుతోంది. రెండేళ్ల క్రితం వారం రోజులపాటు రాకపోకలు నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి తక్కువ ఎత్తులో ఉండడం వల్ల వంకకు


అధిక వర్షానికి నీట మునిగిన వంక (ఫైల్‌ఫొటో)

నీరు అధికంగా వచ్చినప్పుడు నీట మునుగుతోంది. ప్రస్తుతం బ్రిడ్జి పూర్తిగా దెబ్బతిని ఇబ్బందికరంగా మారింది. ఈ మార్గాన రాజువారిపేట, అయ్యవారిపల్లె, తిమ్మాయిపల్లి, నక్కలదిన్నె, అనంతపురం, కుచ్చుపాప, రాజుపాలెం, నరహరిపురం, వెదురూరు, రామసుబ్బమ్మ కొట్టాల గ్రామాల ప్రజలు ప్రయాణించాల్సి ఉంది. వర్షాకాలంలో ఈ మార్గాన రాకపోకలు నిలిచిపోతే ఆయా గ్రామాల ప్రజలు తాళ్లమాపురం, ప్రొద్దుటూరు మీదుగా చాపాడుకు రావాల్సి ఉంటుంది. అలాగే మండల పరిధిలోని గుంతచిపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న బ్రిడ్జి కూడా ప్రమాదపు అంచున ఉంది. మోస్తరు వర్షం పడినా ఈ బ్రిడ్జి నీట మునుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాబోయే వర్షాకాలానికైనా బ్రిడ్జిలను గుర్తించి హై లెవెల్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పురాతన బౌద్ధ స్తూపాలను పరిరక్షించాలి


పురాతన బౌద్ధ స్తూపాలను పరిశీలిస్తున్న బుద్ధిష్టు కల్చరల్ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రాచీన కాలం నాటి పురాతన బౌద్ధ స్తూపాలను, బుద్ధుని పాదాలను పరిరక్షించాల్సిన అవసరం పురావస్తుశాఖ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని బుద్ధిష్ట్ కల్చరల్ సొసైటీ కమిటీ నాయకులు, ఇంటాక్ సభ్యులు కుమారస్వామి, శివారెడ్డి, డాక్టర్ అశోక్‌కుమార్ రామకృష్ణారెడ్డి కోరారు. మండలంలోని పుల్లూరు పంచాయతీ దగ్గరలో ప్రస్తుతం ఉన్న నాగనాధేశ్వర కోన వద్ద కొండపై క్రీస్తు పూర్వం రెండో శతాబ్దం అనగా.. అశోకుని కాలంలో వరుసగా నిర్మించిన ఏడు బౌద్ధ స్తూపాలను, బుద్ధుని పాదాలను ఆదివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బౌద్ధ స్తూపాలు చాలా ప్రాచీనమైనవని వీటిని కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖలు పరిశోధించి పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. బుద్ధుని పాదాలు, స్తూపాలను ఖాజీపేట ప్రాంతంలో పలు గ్రామాల్లో మనం చూడవచ్చని తెలిపారు. అవన్నీ ఉద్దేశిక స్థూపాలని. వీటిని అప్పటి బౌద్ధులు ఇక్కడ ఇటుకలతో నిర్మించుకున్నారని పేర్కొన్నారు. గుహల్లో వారు ధ్యానం చేసుకునేవారని తెలిపారు. స్తూపం చుట్టు జ్ఞాన దీపస్తంభాలను కూడా పాతారన్నారు. పురావస్తు శాఖ పరిశోధనలు చేస్తే ఇంకా ఎన్నో బౌద్ధానికి సంబంధించిన చారిత్రక ఆధారాలు లభిస్తాయని వివరించారు. కడప జిల్లాలో చాలా చోట్ల బౌద్ధం విరాజిల్లిందన్నారు. ప్రజలు బౌద్ధ ధర్మాన్ని పాటిస్తూ దానిని ఆదరించారని చెప్పారు. నందలూరు దగ్గర ఆరామాలు ఖాజీపేటలో ఉన్న 7 బౌద్ధ స్తూపాలు.. ఖాజీపేటకు దగ్గరలో ఉన్న బోసిరెడ్డిపల్లి పొలంలో లభిస్తున్న బుద్ధుని పాదాలు, స్తూపం.. పుష్పగిరిలో ఉన్న అవశేషాలు వీటికి నిదర్శనమని పేర్కొన్నారు. వీటిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని బౌద్ధ ధర్మాన్ని ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు మూఢ విశ్వాసాలతో తమకు తెలియకుండానే అంతర్జాతీయంగా ప్రచారంలో ఉన్న బౌద్ధ సంబంధ అవశేషాలను ధ్వంసం చేస్తున్నారని, ప్రభుత్వం వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఖాజీపేటను ప్రముఖ బౌద్ధ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కల్చరల్ సొసైటీ సభ్యులు విన్నవిస్తున్నారు. బోసిరెడ్డిపల్లె సమీప పొలాల్లో ఉన్న బౌద్ధ స్తూపాలను, బౌద్ధ పాదాలను తాము పరిరక్షిస్తామని గ్రామ పెద్ద పోలిరెడ్డి తమకు హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

రాజీవ్‌గాంధీ గొప్ప రాజనీతిజ్ఞుడు

ప్రజాశక్తి - కడప

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి సుమంత్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోని ఇందిరా భవన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. యువజన కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ముందుగా కాంగ్రెస్ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం రాజీవ్ ఆశయాలకు తూట్లు పొడుస్తూ పరిపాలన చేస్తున్నాయన్నారు. గ్రామ స్వరాజ్యం కోసం రాజీవ్ పరితపించగా జగన్ ప్రభుత్వం సర్పంచులకు విధులు, నిధులు, అధికారాలు ఇవ్వకుండా స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. రాజీవ్‌గాంధీ స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని తులసిరెడ్డి పిలుపునిచ్చారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి, భోగాపార్వతమ్మ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బండి జకరయ్య, సత్తార్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్, మహిళా అధ్యక్షురాలు శ్యామలాదేవి, యూత్ కాంగ్రెస్ ప్రొద్దుటూరు అధ్యక్షుడు వంశీ యాదవ్, నాయకులు, ప్రసాద్‌గౌడ్, చీకటి చార్లెస్, శ్రీనివాసులు, పి.కృష్ణవేణి, చక్రవర్తి, ప్రభుకుమార్, ఓబులేసు, రాజకుమార్, నరసింహారెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ ఎన్.తులసిరెడ్డి

వేంపల్లె : మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్‌గాంధీ గొప్ప దార్శనికుడు, రాజనీతిజ్ఞుడని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి తులసిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తితో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త రాష్ట్ర, దేశ శ్రేయస్సుకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, రామకృష్ణ, నరసింహారెడ్డి, బద్రి, వెంకటేష్, నాగార్జున, శివ పాల్గొన్నారు.

వినియోగదారుల ఫోరం సంచలన తీర్పు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వినియోగదారుల ఫోరం సంచలన తీర్పు ఇచ్చిందని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కరుణాకర్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో క్లాసిక్ మొబైల్ నిర్వాహకులకు కడప జిల్లా వినియోగదారుల ఫోరం మొట్టికాయలు వేసిందన్నారు. తానుకొన్న మొబైల్ నాణ్యత లోపంతో వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించి, 2019లో ఫిర్యాదు చేయగా.. కరోనా కారణంగా 2023 మే నెలలో కరుణాకర్ యాదవ్ తన వాదనలతో ఏకీభవించి, వినియోగదారుల ఫోరమ్ కఠినమైన తీర్పును ఇచ్చింది.ఈ తీర్పులో రూ.8,990 ఖరీదైన మొబైల్, 2019 నుండి 2023 మే జడ్జిమెంట్ ఇచ్చిన నాటికి అనగా ఆ మొత్తానికి 6 శాతం వడ్డీ, మానసిక మనోవేదనకు రూ.1000, ఖర్చులకు రూ.500 ప్రకారం మొత్తం 45 రోజుల్లో చెల్లించాలని వినియోగదారుల ఫోరం తీర్పును వెలువరించింది. వస్తువు కొన్నప్పుడు రశీదు తీసుకోవాలన్నారు. నాణ్యత లోపం ఉంటే జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయాలని కరుణాకర్ యాదవ్ తెలిపారు. అవసరమైతే తమను సంప్రదిస్తే పూర్తిస్థాయిలో ఎలాంటి రుసుం. చార్జీలు తీసుకోకుండా ఉచితంగా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసి, న్యాయపోరాటం జరిగే వరకు అండగా ఉంటామని ఆయన తెలిపారు.


మాట్లాడుతున్న హెచ్‌ఆర్‌సి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కరుణాకర్ యాదవ్

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం


రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల పట్టణంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కురవడంతో వీధులన్నీ జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గత వారం నుంచి ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు వర్షం కొంత ఉపశమనం కలిగింది.

దువ్వూరు : మండలకేంద్రమైన దువ్వూరులో ఆదివారం మధ్యాహ్నం వరకు ఎండలు విపరీతంగా కాశాయి. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అయితే సాయంత్రం 4 గంటల సమయంలో ఉన్నట్లుండి వర్షం పడడంతో మండల ప్రజలు ఎండ నుంచి కొంత ఉపశయనం పొందారు. వర్షం పడడంతో ప్రజలు వేడిమి నుంచి ఉపశమనం పొందారు. మండలంలోని గుడిపాడు, చల్లబసాయిపల్లి, చిన్నసింగనపల్లె, పలు గ్రామాల్లో ఒక మోస్తరు వర్షం పడింది.

చెన్నూరు : మండలంలో ఉరుముతో కూడిన వర్షం కురిసింది. నాలుగు రోజులు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు ఆదివారం సాయంత్రం కురిసిన తేలిక పాటి వర్షం కొంత ఉపశమనం కల్గింది. గాలివానకు పలుచోట రేకుల ఇల్లు దెబ్బతిన్నాయి. బెస్త కాలనీలో పెద్ద వృక్షాలు నేలకొరిగాయి.

పిడుగుపాటుకు చెట్టు దగ్ధం

ముద్దనూరు : ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి ఆదివారం జమ్మలమడుగు రహదారిలో పిడుగుపాటుకు చెట్టు దగ్ధమైంది. ఆ సమయంలో అక్కడ ప్రజలెవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. వర్షానికి మండల కేంద్రంలోని పలు రోడ్లు, కాలనీలు జలమయమయ్యాయి.


దువ్వూరు : వీధిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - చాపాడు


అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

మైదుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో 1982-83 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మైదుకూరులోని సాయి బాబా కల్యాణ మండపంలో జరిగింది. 40 ఏళ్ల కిందట పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఒకచోట కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న అప్పటి స్నేహితులు ఒకచోట కలుసుకొని జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు, తమతో కలిసి చదువుకుని దూరమైన వారి ఫొటోలను సేకరించి వారికి నివాళులు అర్పించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు ఆర్.రామమునిరెడ్డి, పుల్లయ్య, పద్మజ, బేగం, ఉమామహేశ్వర్‌రెడ్డి, సుబ్బరాయుడు మాట్లాడుతూ స్థాయి భేదాలు లేని వయసులో చదువుకొని మిత్రులుగా మారడం గొప్ప విషయమన్నారు. ఎంతో ఉన్నత స్థానంలో ఉన్నా చదువు చెప్పిన ఉపాధ్యాయులను గౌరవిస్తూ మెలగడం హర్షణీయమన్నారు. పలు నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ధనపాల జగన్, ఎస్ వెంకటరాముడు, నాగేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రవి, సుబ్బారావ్, ఓబులేసు, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

పాలిసెట్‌లో మెరిసిన ఉచిత కోచింగ్ ఆణిముత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్రస్థాయిలో మెరిసిన పాలిసెట్ విద్యార్థులు అన్నవరం గాయత్రి, మారుజొళ్ల గీతిక, మలిపెద్ది విశృత్, తుంపెర సాయి ధీరజ్ ఉత్తమ ర్యాంకులు సాధించారు. వీరితోపాటు 20 వేల ర్యాంకు లోపు 25 మంది సాధించారు. ఈ ఏడాది 260 మంది పాలీసెట్ ప్రవేశ పరీక్ష రాయగా 243 మంది పాలిటెక్నికల్ చేరేందుకు అర్హత సాధించారు. వీరిని ఆదివారం వైసిపి వైద్య విభాగం నాయకులు వైయస్ అభిషేక్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్నప్ప అభినందించారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందాన్ని కూడా వారు అభినందించారు. కార్యక్రమంలో సేవాసమితి నేత్రనిధి టెక్నీషియన్ హరీష్, సభ్యులు చాంద్‌బాషా, రాఘవేంద్రా రెడ్డి పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న డాక్టర్ అభిషేక్‌రెడ్డి

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట బస్టాండ్ కూడలిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్ఐ కుళ్లాయప్ప చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహం తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేశామన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ

సంగీతంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం విద్యార్థులకు సంగీతంపై గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి అవగాహన కల్పించారు. సంగీతంలోని సప్త స్వరాలను విశదీకరించారు. స,రి,గ,మ,ప,ద,ని ఈ ఏడు స్వరాలను సప్తస్వరాలు అంటారని వివరించారు. స: అనగా షడ్జమం.. ఇది నేమలి కూత ద్వారా ఏర్పడుతుంది. రి: అనగా రిషభం ఇది ఎద్దు రంకె ద్వారా, గ: గాంధారం ఇది మేక అరుపు ద్వారా ఏర్పడుతుందన్నారు. మ: అనగా మధ్యమం ఇది క్రౌంచ పక్షి ద్వారా ఏర్పడుతుంది. ప: అనగా పంచమం ఇది కోయిల కూత ద్వారా ఏర్పడుతుందన్నారు. ద: దైవతం ఇది గుర్రం శకిలింపు ద్వారా, ని: అనగా విషాదం ఇది ఏనుగు ఘీంకారం ద్వారా ఏర్పడుతుందని ఆయన విద్యార్థులకు విశదీకరించారు. సంగీతం విశిష్టతను తెలిపారు.

పలు కార్యక్రమాల్లో 'పుట్టా'

ప్రజాశక్తి - దువ్వూరు


టిడిపి నాయకులతో పుట్టా సుధాకర్‌యాదవ్

మండలంలోని చింతకుంట మాజీ సర్పంచు హుస్సేన్ సాబ్ కుమార్తె వివాహ వేడుకల్లో మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, నరేష్ నాయుడు ప్రొద్దుటూరుకు చెందిన ముక్తియార్, మండల టిడిపి కన్వీనర్ బోరెడ్డి వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు. అలాగే కానగూడూరు, మూడిళ్లపల్లె గ్రామాల జాతర కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

సిఎం జిల్లాలో అభివృద్ధి శూన్యం

- సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జిల్లా వాసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటికీ అభివృద్ధి ఏమాత్రం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక సిపియం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ సిఎం అయ్యాక కడప జిల్లా ఎంతో అభివృద్ధి సాధిస్తుందని పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయ్యాయన్నారు. కడప ఉక్కు జిందాల్‌కు ఇచ్చి ఏడాది గడచినా పురోగతిలేదన్నారు. వైసిపి ప్రజావిశ్వశనీయతను క్రమంగా కోల్పోతోందన్నారు. పెండ్లిమర్రి వద్ద ఆధునిక ఉక్కు భారీ పరిశ్రమకు కావలసినంత ఇనుప ఖనిజమున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. బిజెపితో వైసిపి, టిడిపి అంటకాగితే భవిష్యత్ శూన్యమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సంఘమేశ్వరం, సిద్దేశ్వరం వద్ద ప్రాజెక్ట్, బ్రిడ్జి నిర్మాణం తక్షణం అవసరమన్నారు. నెల్లూరు-ప్రొద్దుటూరు రైల్లేలైన్ ప్రతిపాదనలు 50 ఏళ్లు పూర్తయినప్పటికీ ఆ ఫైల్‌లో కదలిక లేకపోవడం బాధాకరమన్నారు. కరువు మండలాల్లో మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టల నిర్మాణం చేపట్టాలన్నారు. వైసిపి ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసి, సచివాలయాలను గాలిలో ఉంచారని చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి సత్య నారాయణ, పట్టణ కమిటీ సభ్యులు ఓబులేసు, పక్కీరప్ప, ముంతాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 22 మే 2023
5
అన్నమయ్య



జాతీయ ఫ్లోర్ కర్లింగ్ ఛాంపియన్‌షిప్‌కు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- రాయచోటి

జాతీయ స్థాయి ఫ్లోర్ కర్లింగ్ ఛాంపియన్షిప్ - 2023 క్రీడలకు రాయచోటి మండలానికి చెందిన భూమారపు హర్ష కుమార్ ఎన్నికయ్యారు. జాతీయ క్రీడలు అరుణాచల్ ప్రదేశ్‌లోని ఈటా నగర్‌లో ఈనెల 19 నుంచి 21 నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో చక్కటి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిపోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థి ప్రస్తుతం తిరుపతిలోని విద్యానికేతన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. స్కూల్ కోచ్ రజిని నేతృత్వంలో క్రీడల్లో పాల్గొనడానికి వెళ్లి అక్కడ కూడా గెలుపొందారు. జాతీయస్థాయి క్రీడల్లో ఎదిగేందుకు ప్రోత్సాహం అందించిన విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎం. మోహన్ బాబు, సిఇఒ ఎం.విష్ణు బాబు, ప్రిన్సిపల్ రాజేష్ పాటిల్, వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, కోచ్ రజిని కుమార్, ఆంధ్ర ప్రదేశ్ కర్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై. వెంకటేశ్వరమ్మ,సెక్రటరీ వై. మోహన్, సురేందర్ రెడ్డికి విద్యార్థి భూమారపు హర్ష కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. రాయచోటి మండలం నుంచి జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల విద్యార్థి తండ్రి భూమారపు ఆంజనేయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గాలివాన బీభత్సం

విరిగిపడ్డ వృక్షాలు
నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
మామిడి రైతులకు అపార నష్టం
గాలివీడులో వడగండ్ల వాన



లక్కిరెడ్డిపల్లె : ఇంటిపై పడిన చెట్టు



నందలూరు : కన్యకా చెరువులో నేలకొరిన విద్యుత్ స్తంభం



కలికిరి : కింద పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్



గాలివీడులో పడిన వడగండ్లు

ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. అన్నమయ్య జిల్లాలోని గాలివీడు, రామాపురం, కలికిరి, నిమ్మనపల్లి, లక్కిరెడ్డిపల్లె, నందలూరు, తదితర మండలాల్లో ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దీనికి గాలి తోడవడంతో అక్కడక్కడా చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో సుమారు గంటన్నరపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వేగంగా వీచిన గాలికి కలికిరి మం డలంలో మామిడి చెట్లు, కాయలు నేలకొరిగాయి. దీంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది.
- ప్రజాశక్తి- యంత్రాంగం

నేలకొరిగిన మామిడి, వరి..

కలికిరి : గాలివాన బీభత్సంతో మండలంలోని మామిడి చెట్లు నెలకొరిగాయి. కాయలు నేలరాలిపోవడంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటితోపాటు గాలివానకు మామిడి తోటల్లో కాయలు నేలరాలడంతో బాధిత రైతులకు లక్షల్లోనష్టం వాటిల్లింది. వందల ఎకరాల్లో వరిమళ్లు కోతకు వచ్చే సమయంలో నేలమట్టమయ్యాయి. గుట్టపాలెం పంచాయతీ ఆచార్ల గొల్లపల్లిలో వెంకటప్పకు చెందిన వ్యవసాయ బోరు ట్రాన్స్‌ఫార్మర్ కిందపడిపోగా, మరో రైతులకు చెందిన రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి.

విరిగిపడ్డ చెట్లు ..


నిమ్మనపల్లి : గాలివాన బీభత్సానికి మండలంలోని పలుచోట్ల భారీవృక్షాలు విరిగి పడ్డాయి. ఆదివారం సాయంత్రం సుమారు నాలుగు గంటల ప్రాంతంలో తీవ్రమైన గాలులతో మోస్తారుగా వర్షం కురిసింది. గాలుల తాకిడికి నిమ్మనపల్లి - కందూరు రోడ్డు మార్గంలోని పలు చోట్ల పెద్ద చెట్లు రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డాయి. సైదాపేటకు సమీపంలో చింత చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడడంతో రోడ్డుపై ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు నిలి చాయి. దీంతో ఇతర ప్రాం తాలకు వెళ్లాల్సిన ప్రయాణికులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

వడగండ్ల వాన..

గాలివీడు : ఆది వా రం సాయంత్రం అరగంటసేపు ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. గాలులు బలంగా వీచడంతో వేళ్లతో సహా చెట్లు నేలకొ రిగాయి. మధ్యాహ్నం వరకు ఎండ వేడిమితో అల్లాడిని ప్రజలకు ఒక్కసారిగా వాతా రణం మారడంతో కొంత ఉపసమనం కల్గింది.

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లి గ్రామం కొత్తపల్లి సమీపంలో ఈదురు గాలుల ధాటికి విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగాయి. కొత్తపల్లి గ్రామస్తులు విద్యుత్ అధికారులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించడంతో వారు విద్యుత్ సరఫరాను నిలిపేశారు. మరమ్మతులు చేసి గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు.

లక్కిరెడ్డిపల్లి : ఆదివారం సాయంత్రం గాలులతో కూడిన వర్షం కురవడంతో మండల కేంద్రంలోని పాత కోర్టు, కస్తూరి రాజుగారిపల్లె, సిద్ధకవాండ్ల పల్లె గ్రామాలలో విద్యుత్ స్తంభాలు, మల్బరీ షెడ్డు, వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభం నేలకొరిగిన సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఎలాంటి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. విద్యుత్ స్తంభం కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.



లక్కిరెడ్డిపల్లె : గాలివానకు నేలరాలిన మామిడి

చెట్లు విరిగి పలువురికి తీవ్ర గాయాలు

మండలంలోని పలు ప్రాంతాల్లో రేకుల షెడ్లు కుప్పకూలిపోయాయి. సిద్ధకవాండ్లపల్లెకు చెందిన కృష్ణారెడ్డి ,లక్ష్మీదేవి దంపతులు నివాసం ఉంటున్న ఇంటిపై పెద్ద చెట్టు పడడంతో వారికి గాయాలయ్యాయి. అలాగే తురకపల్లె చెందిన బీబీ ఇంటిపై చెట్టు ఉన్నట్టుండి పడడంతో ఆమె గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు వైద్యం కోసం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

నందలూరు : మండలంలో ఆదివారం సాయంత్రం వీచిన గాలులకు, కురిసిన వర్షానికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. నాగిరెడ్డి పల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కన్యక చెరువులో విద్యుత్ స్తంభం నీటిలో మునిగిపోవడంతో పాటు మరో నాలుగు ఒరిగిపోయాయి. విద్యుత్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ లైన్ మెన్ శ్రీరామ్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. నాగిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



నిమ్మనపల్లె : రోడ్డుపై నేలకొరిగిన భారీ వృక్షం

చర్చించేనా?



కడప నగర రహదారుల పురోగతి ఏదీ ?
సా..గుతున్న ఉక్కు పరిశ్రమ ఏర్పాటు
అన్నమయ్య నిర్వాసితులకు స్వాంతనేదీ
'కొప్పర్తి' పైప్‌లైన్ ఏర్పాటు ఎప్పుడో?!
నేడు జడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కడపప్రతినిధి

జిల్లా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చర్చించడంపై అందరి దృష్టీ నిలిపింది. ప్రతిపక్ష టిడిపి నుంచి పాలకపక్షం తప్పిదాలను నిలదీసే అవకాశాలు తగ్గిన నేపథ్యంలో సమగ్ర చర్చ దేవతావస్త్రంలా మారిన సంగతి తెలిసిందే. కడప నగరంలోని ఆరు రహదారుల విస్తరణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. వర్షాకాలం రాబోతున్న తరుణంలో రహదారుల విస్తరణ పనుల్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది. కడప నగరంలోని ముంపు ప్రాంతాల సంరక్షణకు ఉద్దేశిం చిన మెయిన్ డ్రెయిన్ పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. జిల్లా ప్రధానంగా వ్యవసాయాధారిత ప్రాంతం. ఖరీఫ్ ప్రణాళిక రూపకల్పనలో సూచనలు, సలహాలు చేయడం, ఎరువులు, పురుగు మందుల కొరత తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా చర్చించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలోని అన్నమయ్య, గండి కోట నిర్వాసితుల మొర, పింఛా, ఎల్ఎస్‌పి గేట్ల మరమ్మతులు, సర్వ రాయసాగర్, బ్రహ్మంసాగర్, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలోని లింగాల కాల్వ లీకేజీ, యురేనియం పైప్‌లైన్ పనుల పురోగతిపై ప్రధానంగా చర్చించాల్సి ఉంది. 2021 నవంబర్ వరదల్లో అన్నమయ్య రిజర్వాయర్ మట్టి కట్ట తెగిన సందర్భంగా సుమారు ఆరు గ్రామాల ప్రజానీకం నిర్వాసితులుగా మారిన సంగతి తెలిసిందే. అప్పట్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్వాసితులను ఆదు కుంటామని హామీనిచ్చారు. ఇప్పటికీ హామీలో ఆశించిన పురోగతి కనిపించ లేదు. ఇదిలాఉండగా పింఛా, ఎల్ఎస్‌పి గేట్లకు మరమ్మ తులు, సర్వరాయసాగర్, బ్రహ్మంసాగర్ లీకేజీల పరిష్కారం, యర్ర బల్లి - పార్నపల్లి పైప్‌లైన్ పనుల్లో ఆలస్యం కారణంగా యురేనియం నిర్వాసిత గ్రామాలకు తాగునీటి సమస్య ఎప్పటికి పరిష్కారమవు తుందో సమాధానం రాబట్టాల్సి ఉంది. ప్రతియేటా వర్షాకాలంలో వచ్చే వరదల నుంచి కడప ముంపు ప్రాంతాల పరిరక్షణపై దృష్టి సారించాల్సి ఉంది. గండికోట నిర్వాసితులకు రూ.ఏడు లక్షల పరి హారానికి అదనంగా మరో రూ. మూడు లక్షలను అందిస్తామని ఇచ్చిన హామీని నిలుపుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. కడప జిల్లా జీవనాడిగా పేర్కొంటున్న ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేయడం సరే, పనుల పురోగతి కనిపించడం లేదు. 2019 సార్వత్రిక ఎన్నికల ముంగిట తాము అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలులో మూడు అడుగు ముందుకు ఆరు అడుగులు వెనక్కి చందంగా మారింది. ఈఏడాది ప్రారంభంలో జెఎస్‌డబ్ల్యూ సంస్థ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఇప్పటివరకు ఆశించిన పురోగతి కనిపించక పోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. కొప్పర్తిలో పరిశ్రమల ఏర్పాటుకు అవ సరమైన నీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు ప్రక్రియ ఎప్పటికి పూర్తవు తుందో తెలియడం లేదు. రాష్ట్రప్రభుత్వ నిష్క్రియాపరత్వం కారణంగా కొప్పర్తికి పరిశ్రమల రాక ఆలస్యమవుతోంది. ఫలితంగా జిల్లాలో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు వలసలు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా జిల్లా పరిషత్ పాలకవర్గం జిల్లా సమగ్రాభివృద్ధి అర్థవంతమైన చర్చ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పడంలో సందేహం లేదు.

బాలికపై సైకో దాడి

- ప్రాణాపాయ స్థితిలో బాధితురాలు
- సైకోను కొట్టి చంపిన గ్రామస్తులు

ప్రజాశక్తి - గుర్రంకొండ

పొలం దగ్గర ఒంటరిగా ఉన్న బాలికపై ఓ సైకో దాడి చేశాడు. దీంతో బాధితురాలు ప్రాణాపాయస్థితికి చేరుకుంది. విషయం తెలసుకున్న ఆమె బంధువులు, గ్రామస్తులు అతన్ని రాళ్లతో కొట్టి చంపారు. ఈ సంఘటన మండలంలో తీవ్ర సంచనలం సృష్టించింది. పోలీసుల కథనం మేరకు..మండలంలోని పసలబాండ్లపల్లి పంచాయతీ తుమ్మలగొంది ఉదారోళ్లపల్లెకు చెందిన ఆకులప్ప, ఆదిలక్షుమ్మ కుమార్తె మహేశ్వరి అనే బాలిక ఆదివారం తన పొలంలో పశువులను మేపుకోవడానికి వెళ్లింది. ఆ సమయంలో అదేగ్రామానికి చెందిన ఉత్తన్న (47) అనే వ్యక్తి పొలంలో పశువులు వెళ్లడంతో ఎన్ని సార్లు చెప్పినా మళ్లీ వచ్చారా అంటూ ఒంటరిగా ఉన్న బాలికపై రాళ్లతో దాడి చేశాడు. ఈ సంఘటనలో బాలిక తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. సమాచారం అందుకున్న బాలికల తల్లిదండ్రులు, బంధువులు చికిత్స నిమిత్తం బాలికను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడిని చేసిన ఉత్తనన్ను గ్రామస్తులు, బాలిక బంధువులు రాళ్లతో కొట్టి చంపేశారు. ఘటనపై గుర్రంకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదీలా ఉండగా బాధితురాలి పెద్దనాన్నపైనా మృతుడు దాడి చేశాడు. రెండేళ్ల కిందట తన భార్యను చంపిన కేసులో నిందితుడిగా ఉండి, జైలు నుంచి విడుదల అయిన తన కుమార్తెను సైతం చంపాడని గ్రామస్తులు పేర్కొంటున్నారు.



తీవ్రంగా గాయపడిన మహేశ్వరి

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాష్ట్రంలో రెండో అధికార భాషగా అమలు అవుతున్న ఉర్దూ భాషను ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో విస్తృతస్థాయిలో భాషాభివృద్ధికి కృషి చేయాలని అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురంలోని నాయక్‌వీధికి చెందిన వైసిపి నాయకుడు అబ్దుల్ కలీమ్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన నేపథ్యంలో ఆదివారం మంత్రిశ్రీతీ సదుంలో కలుసుకొని, పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉర్దూను రెండో అధికార భాషగా అమలు చేస్తోందని, ఉర్దూ సాహిత్యం, భాషాభివృద్ధికి ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. వైసిపి ప్రభుత్వం అటు పాలనలోనూ, ఇటు సంక్షేమ పథకాల అమలులోనూ మైనార్టీలకు ప్రాధాన్యత కల్పిస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీలు జగన్మోహన్ రెడ్డికి అండగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా, మాజీ సర్పంచ్ హుమయున్, నాయకలు సైపుల్లా, ఇలియాజ్ పాల్గొన్నారు.



రామచంద్రారెడ్డిని కలిసిన అబ్దుల్ కలీమ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రైతులకు సహకరించాలి : మేడా

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టా భూమి కలిగి సాగు చేసుకుంటున్న రైతులను ఇబ్బంది పెట్టకుండా రెవెన్యూ అధికారులు సహకరించాలని శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఊటుకూరు పంచాయతీలోని కొండ్లోపల్లి, ఊటుకూరు దళితవాడ, వడ్డిపల్లె గ్రామస్తులు బోయినపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మేడా మల్లికార్జునరెడ్డిని కలిసి తమ పట్టా భూములు సాగు చేసుకుంటుండగా రెవెన్యూ శాఖ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. వెంటనే స్పందించిన మేడా మల్లికార్జున రెడ్డి సంబంధిత విఆర్ఒను పిలిపించి రైతులను ఇబ్బంది పెట్టవద్దని, పట్టా కలిగి ఉన్న రైతుల భూముల్లో ఇతరులు ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ భూములలో రైతులు సాగు చేసుకునే విధంగా వారికి సహకరించాలని సూచించారు. కలెక్టర్, రాజంపేట సబ్ కలెక్టర్, తహశీల్దార్లకు ఈ విషయమై లిఖితపూర్వకంగా తెలియజేసి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొండ్లోపల్లి, ఊటుకూరు హరిజనవాడ, వడ్డిపల్లె గ్రామాలకు శ్మశాన వాటికకు స్థలం పరిశీలించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఊటుకూరు ఎంపిటిసీ నాగ చంద్రశేఖర్ రెడ్డి, పృథ్వీపతి రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

35 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

ప్రజాశక్తి- రాయచోటి

మండల పరిధిలోని చెన్నముక్కపల్లిలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 35 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, కలికిరి, కలకడ, గుర్రంకొండ, పెద్దమండెం, యర్రావారిపాలెం, కె.వి. పల్లి, కదిరి, ఎన్.పి. కుంట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 60 మంది కంటి రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అర్హులైన 35 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 45 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప్ గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాష, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, మహాలక్ష్మి, ఆప్తాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పాలిసెట్ ర్యాంకర్‌కు ఎమ్మెల్యే అభినందన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎపిపాలిసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 241 ర్యాంకు సాధించిన రాయచోటి ప్రాంతానికి చెందిన వేదశ్రీని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు. కృషి, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ర్యాంకర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎస్ బి కోచింగ్ సెంటర్ నిర్వాహకులు సుధాకర్, కౌన్సిలర్ కొలిమి ఛాన్ బాష పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువత

దీప బ్లడ్ బ్యాంకులో మెగా రక్తదాన శిబిరం

రాయచోటి : పట్టణంలోని దీపా బ్లడ్ బ్యాంకులో హెల్పింగ్ హాండ్ వ్యవస్థాపకులు డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా సీనియర్ వైసిపి నాయకులు పారిశ్రామికవేత్త శ్రీనివాసులు రెడ్డి (కోడిశీన) హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్‌ను యువకులు , ప్రజలు స్ఫూర్తిగా తీసుకొని వేసవి కాలాన్ని సైతం లెక్కచేయకుండా అత్యవసర సమయంలో ప్రజలకు రక్త కొరత ఉండకూడదన్న ఆలోచనలతో 59 మంది దీప బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ ఏడాదిలో కనీసం రెండుసార్లు అయినా తమ రక్తాన్ని బ్లడ్ బ్యాంకులకు దానం చేస్తే ఎంతో మంది క్షతగాత్రులకు, ఆపదలో ఉన్న రోగులకు ఉపయోగపడుతుందని అన్నారు. రక్తదానం చేయడం వల్ల వ్యక్తుల ఆరోగ్యం సక్రమంగా ఉండడంతో పాటు ఆరోగ్యవంతంగా ఉంటారని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడంలో అపోహలు మాని ప్రాణ హానిలో ఉన్న రోగులకు సహాయం చేసే వారవుతారని పేర్కొన్నారు. వేసవికాలంలో రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని సూచించారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, రెడ్డయ్య యాదవ్ , హెల్పింగ్ హ్యాండ్స్ చైర్మన్ డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ రక్త దాతలు అర్షద్, షహీల్, మహమ్మద్, సుఫియాన్ సమీర్, అబుజార్, నవాజ్ ,మహమ్మద్ సుబహాన్,ఆసిఫ్, ఫిరూజ్, జబివుల్లా, షాబుద్దీన్, షారుఖ్ ఖాన్, ఉమర్, నూర్, బ్లడ్ నిధి సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో తాత్కాలికంగా 'స్పందన' రద్దు

రాయచోటి : ఉమ్మడి కడప జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఉన్నందున సోమవారం అన్నమయ్య జిల్లాలో నిర్వహించబోయే ప్రజాఫిర్యాదుల స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ గిరీష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అధికారులు అందరూ సర్వ సభ్య సమావేశం పనుల్లో నిమగ్నమై ఉన్నందున స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ, మండల, డివిజన్లలో యథాఆవిధిగా స్పందన నిర్వహిస్తారన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు

బోరుబావికి మోటారు, పైపులు ఏర్పాటు

ప్రజాశక్తి-పీలేరు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి చొరవతో బిస్మిల్లా ఆటో యూనియన్ డ్రైవర్స్ కాలనీలో ఉన్న బోరుబావికి మోటారు, పైపులు, స్టార్టర్ ఏర్పాటు చేసినట్లు ఎంపిపి కంభం సతీష్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పీలేరు మండలం, కాకులారంపల్లి పంచాయతీ, ఇందిరమ్మ కాలనీ సమీపంలోని ఆటో డ్రైవర్స్ కాలనీలో ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి మంజూరు చేసిన నిధులతో ఇటీవల బోరు బావిని తవ్వించామని, ప్రస్తుతం దానికి అవసరమైన సామగ్రిని సమకూర్చినట్లు చెప్పారు. ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ బోదేషావలి మాట్లాడుతూ ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి, ఎంపిపి సతీష్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాకులారంపల్లి సర్పంచ్ హరిణి సురేష్ కుమార్ రెడ్డి, ఆటో యూనియన్ పట్టణ ఉపాధ్యక్షులు. నౌలక్ హుస్సేన్, ఇస్మాయిల్, శీను పాల్గొన్నారు.



బోరుబావికి మోటారు, పైపులు, స్టాటరు అందజేస్తున్న ఎంపిపి



సూచిక బోర్డును ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ పి.రామకృష్ణ

హెల్మెట్ ధరించండి..రక్షణ పొందండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. ఆదివారం రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులకు మరింత అవగాహన కల్పించడానికి నిమ్మనపల్లి–మదనపల్లి రోడ్డు మార్గంలోని ప్రమాదకర మలుపుల వద్ద రోడ్డు భద్రత నియమాల సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రమాద సూచికల బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇటీవలే ప్రమాదకర మలుపుల వద్ద ఉన్న పిచ్చి మొక్కలను తొలగించినట్లు పేర్కొన్నారు. రోడ్డుపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ను ధరించి.. ప్రమాదాల నుంచి రక్షణ పొందాలని తెలిపారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపవద్దని, అతివేగంతో ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని అన్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనాలకు తప్పనిసరిగా లైట్లు పనిచేయాలని అన్నారు. ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం వలన, వాహనదారులు వాటిని గమనించి సురక్షితంగా ప్రయాణాన్ని సాగించగలరని అన్నారు. వాహనాలు నడిపేవారు డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే, వారి తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందని సూచించారు. ఇకపై నిమ్మనపల్లి మండల పరిధిలో ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేస్తామని, ప్రతి వాహనదారుడు సంబంధించిన పత్రాలను కలిగి ఉండాలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపినా, నిర్లక్ష్యంగా వ్యవహరించే డ్రైవర్ల పైన కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, కానిస్టేబుల్ కేశవ, రాజేష్, సుధాకర తదితరులు పాల్గొన్నారు.

26న మస్తాన్ దివానే సాహెబ్ ఉరుసు

ప్రజాశక్తి-గాలివీడు

ఈనెల 26,27 తేదీలలో గాలివీడు మస్తాన్ దివానే సాహెబ్ ఉరుసు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహకులు ఆరిఫ్ షాదూఖాన్ జమ్రుద్ భాషా రంగీన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దూరు కస్పాకు వెనుక వైపు ఉన్న చెరువు వంకలో దివానా సాహెబ్ జెండామాను వద్ద శుక్ర, శనివారాల్లో ఘనంగా ఉరుసు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 26న గంధం, శుక్రవారం ఆర్షియానాజ్ టివి సింగర్ మైసూర్ ఫైజల్, అలీ టివి సింగర్ అహ్మదాబాద్ 27న శనివారం ఆస్మానికీత్ టీవీ సింగర్ మైసూర్ చాంద్ అతిస్ టీవీ సింగర్ గోవా ఆధ్వర్యంలో ఖవ్వాలి నిర్మించబడునని పేర్కొన్నారు. ప్రతి ఏడాది రెండు రోజులు భోజనాల కార్యక్రమాన్ని యాసిన్ ఖాన్ ఎంటర్ప్రైజస్ సమర్పిస్తారు.


అట్టహాసంగా తాడు లాగుడు పోటీలు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల పరిధిలోని మడితాడు పంచాయతీ జికె రాచపల్లి సమీపంలో వెలసిన మడితేటమ్మ, చిన్నకమ్మ, పెద్దక్కమ్మ తిరుణాలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తాడు లాగుడు పోటీలను వైసిపి నాయకులు కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బిఎల్.నరసింహారెడ్డి కృష్ణమోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు మంత్రి శివారెడ్డి టాస్ వేసి తాడులాగులు పోటీలను ప్రారంభించారు పోటాపుటిగా 16 టీములు హోరాహోరి పాల్గొన్నాయి. సుండుపల్లె–రాయవరం టీంలు ఫైనల్ కి చేరుకోగా రాయవరం టీమ్ పై సుండుపల్లె పవర్ జిమ్ టీమ్ విజయం సాదించింది. మొదటి బహుమతిగా రెండు పొట్టేండ్లను సుండుపల్లి పవర్ జిమ్ టీమ్ కైవసం చేసుకున్నారు. రెండోవ బహుమతిగా రాయవరం టీమ్ ఒక పొట్టేలును కైవసం చేసుకున్నారు. ఈ పోటీలకు వ్యాయామ అధ్యాపకులు నాగార్జున నిర్వాహకులుగా పాల్గొన్నారు.

నూతన ఎస్ఐగా రఘురాం బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-పుల్లంపేట


బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ రఘురాం

మండల నూతన ఎస్ఐ ఆదివారం రఘురాం బాధ్యతలు స్వీకరించారు. వేంపల్లి ఎస్ఐగా నిధులు నిర్వర్తిస్తూ అక్కడి నుంచి బదిలీపై పుల్లంపేట స్టేషన్ కు వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ నిధులు నిర్వహిస్తున్న సబ్ ఇన్స్క్టర్ సుబ్బారెడ్డిని మదనపల్లి రెండవ పట్టణ ఎస్ఐగా బదిలీ చేసినట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని, ఎర్ర చందనం పై ఉక్కు పాదం మోపుతానని ఎస్ఐ రఘురాం తెలిపారు. ఎటువంటి సహాయం కావాలన్నా మండల ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి


ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి ఉజ్వల భవిష్యత్తును అందుకోవాలని ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లి జడ్పి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో 2022–23 విద్యా సంవత్సరంలో వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో మదనపల్లి కోటబడి మున్సిపల్ హైస్కూల్‌లో 569 మార్కులు సాధించిన విద్యార్థి కె.చాయకృష్ణకు పూలమాల, శాలువ, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం.రెడ్డెన్న శెట్టి, నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జి.కృష్ణమూర్తి, వికలాంగుల సంఘం అధ్యక్షులు మౌలాలి, వుజువల్స్ ఛాలెంజ్ ఉపాధ్యాయులు గురుప్రసాద్, యూత్ కరాటే క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎఆర్.సురేష్, నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు జి.పద్మావతమ్మ, కోశాధికారి జి.క్రిష్ణపూజిత, గజపతి, ఏ.క్రిష్ణమూర్తి, చంద్రమోహన్, రాజేంద్ర ప్రసాద్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా మార్కులు సాధించిన విద్యార్థి కే.చాయకృష్ణను అభినందించారు. భవిష్యత్తులోను రెట్టింపు ఉత్సాహంతో చదివి ఉజ్వల భవిష్యత్తును చేరుకొని తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు.

టిడిపి నాయకుడిని పరామర్శించిన పర్వీన్‌తాజ్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందు తున్న టిడిపి పార్టీ సీనియర్ నాయకుడు మదార్‌సాబ్‌ను టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.ఎం.పర్వీన్ తాజ్ పరామర్శించారు. మండల టిడిపి సీనియర్ మైనార్టీ నాయ కులు మదార్‌సాబ్ గుండెపోటుకు గురయ్యారు. ఆయన కుటుంబ సభ్యులు బెంగళూరులోని జయదేవ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఫర్వీన్‌తాజ్ ఆదివారం బెంగళూరులోని జయదేవ్ ఆసుపత్రికి వెళ్లి మదార్‌సాబ్‌ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అతని ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకొన్నారు. ఆయన కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా నిచ్చారు. ఫర్వీన్ వెంట నూర్‌అహ్మద్, చంద్రమోహన్‌రెడ్డి, సాబ్ జాన్ పాల్గొన్నారు.


మదార్‌సాబ్‌ను పరామర్శిస్తున్న పర్వీన్‌తాజ్

వాలంటీర్ వ్యవస్థ సిఎం మానస పుత్రిక : 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం


అవార్డులు అందుకున్న వాలంటీర్లతో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మానస పుత్రిక వాలంటీర్ వ్యవస్థ అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆది వారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఐదు మంది వలంటీర్లకు సేవా రత్న, 207 మందికి సేవా మిత్ర అవార్డులు, సర్టిఫికెట్లు, శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ వలంటీర్లు ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు, సచివాలయ ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రతి నెల ఒకటవ తేది ఇంటి వద్దకే వెళ్లి ఫించన్ అందజేయాలన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయాలన్నారు. నిరుపేద కుటుంబాలకు సేవ చేసే భాగ్యం వలంటీర్లకు కల్పించారని, మీతో పాటు మీ కుటుంబ సభ్యులకు మంచి గౌరవం దక్కిందని చెప్పారు. కరోనా కష్టకాలంలో వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శంగా నిలిచి, అన్ని రాష్ట్రాలు మనవైపు చూస్తున్నాయన్నారు. అలాంటి వలంటీర్ వ్యవస్థకు నాంది పలికి ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. పేదల సొంతింటి కోసం కేటాయిస్తున్న సెంటు భూమిని సమాధి కట్టుకోవడానికి కూడా సరిపోదంటూ చంద్రబాబు అపహాస్యం చేస్తున్నారని, ఆయన హయాంలో ఏనాడైనా పేదలకు సెంటు స్థలం గాని, ఇళ్లు గాని ఇవ్వలేదన్నారు. చంద్రబాబుకు త్వరలోనే ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, ఇఒ ఉదయ్ కుమార్, జడ్పిటిసి నిర్మల, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, నాయకులు చింతల ఆనంద రెడ్డి, నీళ్ల భాస్కర్, వెంకట్రమణ, కిరణ్ కుమార్, రాయుడు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు రాజీవ్‌గాంధీ


రాయచోటి : రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ అని రాజంపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పూల భాస్కర్ తెలిపారు. రాజీవ్ గాంధీ 32 వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలే కాక ప్రతిపక్ష నేతలు కూడా అభిమానించే వ్యక్తి, ప్రపంచం గర్వించదగ్గ సాంకేతికతను భారతదేశానికి అందించినటువంటి గొప్ప వ్యక్తని కొనియాడారు. స్థానిక సంస్థలలో మహిళలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన మహిళా పక్షపాతి అని అన్నారు. వయోజన ఓటు హక్కును 21 సంవత్సరముల నుంచి 18 సంవత్సరాలకు కుదించి యువత హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శెట్టిపల్లి సన్నీ, మణి, శివ, మురళి పాల్గొన్నారు. **రాయచోటి :** రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అల్లాబకాష్ ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ బాటలోనే ఆయన తనయుడు రాహుల్ గాంధీ పయణిస్తున్నారని దేశాభివృద్ధికి ఆయన సేవలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఎపి సిసి డెలికేట్ ఎస్ఎండి గౌస్ , ఎపిసిసి మైనార్టీ వైస్ చైర్మన్ రఫిక్, జిల్లా జనరల్ సెక్రెటరీ ఖదీర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖాదర్ ఖాన్, జిల్లా కిసాన్ జిల్లా అధ్యక్షుడు చెన్నకృష్ణ, రామాపురం మండల అధ్యక్షుడు మైసూరారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఖాదర్ ఖాన్, దినకర్, నరేష్, వెంకీ, ఇమ్రాన్ పాల్గొన్నారు. **పుల్లంపేట :** రైల్వే కోడూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గోసాల దేవి, రాష్ట్ర ఎస్‌సి సెల్ కన్వీనర్ నల్లగిరి గళ్ళ శాంతయ్య ఆధ్వర్యంలో పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి సందర్భంగా పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పుల్లంపేట మండల అధ్యక్షుడు సిగమాల రమేష్, రైల్వే కోడూరు ఎస్టి నాయకులు తారక్, కళావతి, విద్యార్థి నాయకులు బొమ్మి రాజేష్, సురేష్, నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

హెచ్ఐవి బాధితులతో ప్రేమగా మెలగాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

హెచ్ఐవి బాధితులతో ప్రేమగా మెలగాలని డాక్టర్ సోని అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఐసిటిసి కౌన్సిలర్ లోకేష్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పట్టణ పురవీధుల్లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారి పట్ల ప్రేమానురాగాలతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఆర్ఎస్ ప్రతినిధులు లతాంజలి, శ్రీలక్ష్మి, సీతారామయ్య పాల్గొన్నారు.


మంజునాథ్ కాలనీలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే

మంజునాథ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక పట్టణంలోని 2వ వార్డు పరిధిలోని మంజునాథ్ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని నియోజకవర్గం టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన టిడిపి నాయకులతో కలిసి మంజునాథ్ కాలనీలో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ముఖ్యంగా వర్షపు నీరు రోడ్లపై ప్రవహించడం, సిసిరోడ్లు, వీధిదీపాలు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతు న్నార న్నారు. ఈ సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌కు, అధికారులకు పలుమార్లు విన్నవించి నా పరిష్కరించకపోవడం శోచనీయమన్నారు. రెండు నెలల్లోగా మంజునాథ్ కాలనీ సమస్యలను పరిష్కరించకపోతే రెండువేల మందితో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు షంషీర్, రఘుపతి నాయుడు, జభి, రాజేష్, పూలకుంట్ల హరిబాబు, బాలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సదాశివరెడ్డి, మహేష్ గుప్త తెలిపారు. మూడవ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరంలో భాగంగా ఆదివారం స్థానిక ప్రసాద్ నర్సింగ్‌హోంలో శిబిరాన్ని నిర్వహిం చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అరవింద్ కంటి ఆసుపత్రి వైద్య బృందం 20 మంది పాల్గొని, వైద్య శిబిరానికి హాజరైన 150 మందికి కంటి చూపు పరీక్షలు నిర్వహించారని అన్నారు. వారిలో కంటి ఆపరేషన్ల కోసం అర్హులైన 30 మందిని ఎంపిక చేసి, తిరుపతికి తీసుకువెళ్లినట్లు పేర్కొ న్నారు. వివిధ రకాల కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న వారికి పరీ క్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. శిబిరంలో లయన్స్ సభ్యులు డాక్టర్ ప్రసాద్, సుబ్రహమణ్యం, సురేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పెంజూరి అశోక్, రవికుమార్ పాల్గొన్నారు.

కర్ణాటక ఫలితాలు దేశ రాజకీయ మార్పుకు నాంది

మదనపల్లె అర్బన్ : ఇటీవల విడుదలైన కర్ణాటక ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 136 స్థానాల్లో ఘన విజయం సాధించడంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి విధితమే. రెండోసారి కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్, ఎస్.మహబూబ్ పీర్, తిరుపతి కాంగ్రెస్ బిసి సెల్ నాయకులు చిరంజీవిలు, కర్ణాటక సిఎం కుమారుడు ఎమ్మెల్యే యతి సిద్ధార్థను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల ఫలితాలతో అధికార బిజెపికి మైండ్ బ్లాక్ అయిందని ఎద్దేవా చేశారు. వచ్చే స్వార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టిం చడం ఖాయమని రాహుల్ గాంధీని ప్రధానిగా చూస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే 'చింతల' చిన్నమ్మ మృతికి నివాళి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చిన్నమ్మ చింతల సుజాతమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఆయన పట్టణంలోని ఎల్ఆర్‌వీధిలోని మృతురాలి స్వగృ హానికి చేరుకొని నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢసానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట చింతల శ్రీధర్‌రెడ్డి, చింతల శివానందరెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి ఉన్నారు.


జెవికె శాంపిల్ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న సిఎంఒ

జగనన్న విద్యా కానుక శాంపిల్ మెటీరియల్ పంపిణీ

-జిల్లా సమగ్ర శిక్షా సిఎంఒ జి.కరుణాకర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలాలకు సరఫరా చేసిన జగనన్న విద్యా కానుకలోని వస్తువుల నాణ్యతను పరిశీలించడానికి, క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారు పరిశీలించిన శాంపిల్ మెటీరియల్‌ను మండలాలకు సరఫరా చేసినట్లు జిల్లా సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి జి. కరుణాకర్ తెలిపారు. ఆదివారము ఎంఇఒ కార్యాలయంలో మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గ 15 మండలాలకు శాంపిల్ మెటీరియల్ ను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాలకు సరఫరా చేసిన శాంపిల్ మెటీరియల్ ను ప్రామాణికంగా తీసుకుని, మండలాలకు వచ్చిన ప్రతి మెటీరియల్ నాణ్యతను ఐదు శాతము ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. ఈ సంవత్సరము నుంచి ప్రతి మెటీరియల్ మండల స్టాక్ పాయింట్ నుంచే సరఫరా అవుతుందని, స్టాక్ పాయింట్ లో క్వాలిటీవాల్ పేరుతో శాంపిల్ మెటీరియల్‌ను సంవత్సరము పొడుగునా ప్రదర్శనకు వుంచడం జరుగుతుందన్నారు. జిల్లాకు పూర్తి స్థాయిలో యూనిఫాం, బ్యాగులు, డిక్షనరీలు, బెల్టులు, పాఠ్య పుస్తకాలు మండల స్టాక్ పాయింట్లకు చేరాయని, నోట్ పుస్తకాలు, షఉలు రాగానే స్కూల్ కిట్లను తయారు చేసి జూన్ 1వ తేదీ నుంచి నేరుగా పాఠశాలలకు మెటీరియల్ తరలించడానికి ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమములో ఎంఇఒలు ప్రభాకర్ రెడ్డి, మునీంద్రా నాయక్, వెంకట్రమణ, త్యాగరాజు, సురేంద్రబాబు, నారాయణ పాల్గొన్నారు.

ప్రశాంత జీవనాన్ని గడపాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఫ్యాక్షన్ వీడి ప్రశాంత జీవనాన్ని గడపాలని కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి సూచించారు. మండలంలోని మాలెపాడు గ్రామంలో ఎస్ఐ ఆదివారం నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లు, పొలాలు, గడ్డివాములు తదితర ప్రదేశాల్లో సోదా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్పి అన్బురాజన్ ఆదేశాల మేరకు మాలెపాడులో నాకాబందీ నిర్వహించినట్లు తెలిపారు. ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు సంఘటనలు జరగకుండా ఉండాలని ఎస్ఐ ప్రజలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో 1982–83 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మైదుకూరులోని సాయి బాబా కల్యాణ మండ పంలో జరిగింది. 40 ఏళ్ల కిందట పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఒకచోట కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న అప్పటి స్నేహితులు ఒకచోట కలుసుకొని జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు, తమతో కలిసి చదువుకుని దూరమైన వారి ఫొటోలను సేకరించి వారికి నివాళులు అర్పించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు ఆర్.రామమునిరెడ్డి, పుల్లయ్య, పద్మజ, బేగం, ఉమామహేశ్వర్‌రెడ్డి, సుబ్బరాయుడు మాట్లాడుతూ స్థాయి భేదాలు లేని వయసులో చదువుకొని మిత్రులుగా మారడం గొప్ప విషయమన్నారు. ఎంతో ఉన్నత స్థానంలో ఉన్నా చదువు చెప్పిన ఉపాధ్యాయులను గౌరవిస్తూ మెలగడం హర్షణీయమన్నారు. పలు నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ధనపాల జగన్, ఎస్ వెంకటరాముడు, నాగేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రవి, సుబ్బారావ్, ఓబులేసు, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రామాపురం

లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో భరత్, శ్వేత దంపతుల రెండవ కుమారుడు అర్జున్ పుట్టినరోజు సంధ్భంగా వారి ఆర్థిక సౌజన్యంతో స్థానిక బండపల్లె ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదానం చేయడం జరిగిందని అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సేవా కార్యక్రమాలు మా లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ద్వారా నిర్వహి స్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలకు సహాయం చేసే అవకాశం కలగడం భగవం తుడు మానవులకు ఇచ్చిన గొప్ప వరమని, ప్రతి ఒక్కరూ తమ వంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవ కార్యక్రమాలు చేయాలని కోరారు. అనంతరం దాతలు మాట్లాడుతూ మా రెండవ కుమారుడు అర్జున్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని మా వంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఆశ్రమంలో అన్నదానం చేయడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజులలో కూడా లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి మా వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పిఎస్ హరినాథ్ రెడ్డి, ఉపాధ్యక్షులు లయన్ వి.హరీష్ చంద్ర, లయన్ వి.నారాయణరెడ్డి, దాత కుటుంబ సభ్యులు వృద్ధాశ్రమం మేనేజర్ సుబ్బయ్య, దేవనాధరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

3న వైసిపి సోషల్ మీడియా సమావేశం

బి.కొత్తకోట : పట్టణంలో జూన్ 3న తంబళ్లపల్లె, మదనపల్లి, పీలేరు, రాయచోటి నియోజ కవర్గాల వైసిపి సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు టీమ్ ద్వారక నాథరెడ్డి సోషల్ మీడియా సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సమావేశం రాజంపేట పార్ల మెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్ రెడ్డి, నవాజ్ బాషా, చింతల రామ చంద్రారెడ్డి హాజరు కానున్నారని అన్నారు. నాలుగు నియోజకవర్గాలలోని సోషల్ మీడియా సైనికులకు ఈ సమావేశానికి పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

క్రైం కార్నర్


హత్య కేసులో నిందితుల అరెస్టు చూపుతున్న డిఎస్‌పి మహబూబ్ బాష

హత్య కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలో రెండు రోజుల క్రితం జరిగిన ఓ హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు రాయచోటి డి.ఎస్.పి మహబూబ్ బాష తెలిపారు. ఆదివారం పీలేరు పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో డిఎస్పి మాట్లాడుతూ పీలేరు పట్టణం కావలి పల్లికి చెందిన కారంశెట్టి వెంకటరమణ కుమారుడు కారంశెట్టి భరత్‌కుమార్(22) స్థానిక బాలాజీ టాకీస్ వీధికి చెందిన షేక్ మహమ్మద్‌అలీ అన్న కుమార్తె అయిన అప్సాన (22)ను ప్రేమిస్తున్నానంటూ వెంట పడేవాడని, తనను ప్రేమించమని వేధించేవాడని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18న ఆ యువతి బెంగళూరు నుంచి పీలేరు వచ్చిన సమాచారం అందుకున్న భరత్ తన ద్విచక్ర వాహనంపై బాలాజీ టాకీస్ వీధిలో తిరుగుతూ తనను ప్రేమించాలని, లేదంటే తనను, తన కుటుంబ సభ్యులను చంపుతానని ఫోన్ చేసి బెదిరిస్తుండడంతో ఆ ఫోన్‌ను అప్సాన తల్లి షమీం ఎదురింటిలో ఉన్న తన మరిది మహమ్మద్ అలీకి ఇచ్చింది. మహమ్మద్ అలీ ఫోన్ తీసుకొని మా అమ్మాయిని ఎందుకు బెదిరిస్తున్నావ్ అంటూ భరత్‌ను ప్రశ్నించాడని, అందుకు సమాధానంగా భారత్ మీ ఇంటి దగ్గరకే వస్తా, నీ అంతు చూస్తానని హెచ్చరించాడన్నారు. శుక్రవారం సాయంత్రం భరత్ బండ్ల వంకకు చెందిన తన మిత్రుడు కంప కుమార్ (24)ను వెంటబెట్టుకుని, ఇద్దరూ మోటార్ సైకిల్లో ఆ యువతి ఇంటి ముందుకు వెళ్లి, మహమ్మద్ అలీని నువ్వు నా ప్రేమ వ్యవహారంలో ఎందుకు జోక్యం చేసుకొంటున్నావని తిడుతూ ఆవేశంతో తాను వెంట తెచ్చుకున్న కత్తితో మహమ్మద్ అలీ వీపుపై కుడివైపున బలంగా పొడిచాడన్నారు. మహమ్మద్ అలీ రక్తపు మడుగులో సృహతప్పి పడిపోగా అడ్డొచ్చినా అతని భార్య, తండ్రిపై కూడా ఇటుక రాతితో దాడి చేసి, అక్కడి నుంచి కత్తితో పాటు మోటార్ సైకిల్లో అతని వెంట వచ్చిన స్నేహితుడు కుమార్ తో కలసి పారిపోయాడన్నారు. మహమ్మద్ అలీని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. శనివారం సాయంత్రం 5 గంటలకు నిందితులిద్దరూ పీలేరు–చిత్తూరు రోడ్డులోని రిలయన్స్ పెట్రోలు బ్యాంకు ప్రక్కన ఉన్న నెట్టి బండకు వెళ్లే దారిలో ఉండగా సిఐ ఎన్. మోహన్‌రెడ్డి, ఎస్ఐ ఎంకె.నరశింహుడు, సిబ్బంది కలిసి నిందితులను పట్టుకుని, వారి నుంచి హత్య సమయంలో విని యోగించిన మోటార్ సైకిల్, కత్తి, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

గొర్రెల దొంగతనం కేసులో ..

ప్రజాశక్తి-కలికిరి

మండల పరిధిలోని పత్తేగడ పంచాయతీ, పల్లలవారిపల్లిలో జరిగిన గొర్రె దొంగతనము కేసులో సదుం మండలానికి చెందిన భూపతి, గణేష్‌లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.దిలీప్‌కుమార్ తెలిపారు. ఎఎస్ఐ మధుసూదనా చారి, హెచ్‌సిలు మనోహర్, రఫీ, పిసిలు నందకుమార్, చైతన్య, హోం గార్డు నిజాంతో కలిసి టి.సంద్రావారిపల్లి క్రాసు వద్ద నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి దొంగిలించబడిన గొర్రెను స్వాధీనము చేసుకొని యజమాని మల్లి కార్జునకు అప్పగించినట్లుతెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపినట్లు తెలిపారు.

రాములోరి ఉత్సవంపై ఘర్షణ

ఇద్దరికి గాయాలు :కేసు నమోదు

ప్రజాశక్తి-చిట్వేలు


గాయపడ్డ హోంగార్డు

మండల పరిధిలోని పోలోపల్లి గ్రామంలో శ్రీరాముల దేవాలయ ఉత్సవాలపై గత 20 రోజులుగా యాదవులకు, రాజుల మధ్య చిన్నపాటి ఘర్షణ తలెత్తడంతో స్థానిక ఎస్ఐ , సిఐ విశ్వనాధరెడ్డి సర్ది చెప్పే ప్రయత్నం చేసిన కుదరకపోవడంతో దేవాలయం దగ్గర పోలీస్ పికెట్ ఉంచి ఎవరిని అటువైపు వెళ్ళకుండా చూడడం జరిగింది. ఆదివారం మధ్యాహ్నం ఇరువర్గాల కుల పెద్దలు చర్చల రూపంలో దేవాలయంలో మాట్లాడుకుంటున్న సమయంలో ఇరు వర్గాల మధ్య మాట మాట పెరిగి ఉద్రిక్తతకు దారితీసి రాళ్లు విసరడంతో స్థానిక హోంగార్డు రామారావు, కిరణ్‌కుమార్‌రాజుకు తలకు గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డిఎస్‌పి చైతన్య, సిఐ విశ్వనాథరెడ్డి, రాజంపేట ఎస్ఐ వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ సిబ్బందితో కలిసి గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.